క్లుప్తంగా

అవగాహనతోనే టీబీ నిర్మూలన



దుగ్గొండి : టీబీ నిర్మూలనలో అవగాహన కీలకమని తిమ్మంపేట సబ్‌సెంటర్ వైద్యాధికారి పృథ్వీ తెలిపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సబ్‌సెంటర్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం సందర్భంగా పలువురికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ పృథ్వీ మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ టీబీ వ్యాధి, నివారణపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. టీబీ నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించే పోస్టర్లు ప్రదర్శించారు. సీహెచ్‌ఓ సలోమీ, హెల్త్ అసిస్టెంట్ చాణక్య, టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్‌ఎం బుజ్జమ్మ, ఆశ వర్కర్లు రమ, శారద, విజయ పాల్గొన్నారు.

శాకంబరీ ఉత్సవాలు



నర్సంపేట : పట్టణంలోని సర్వాపురం శ్రీసంతోషిమాత ఆలయంలో మంగళవారం దుర్గాదేవి శాకంబరీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవి ఉపాసకుడు గట్టు నారాయణ చార్యులు, ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వికాస తరంగిణి బాధ్యులు ప్రవచనం వినిపించారు. దుర్గాదేవి చరిత్ర, అవతారాలు 18 అధ్యాయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షుడు కృష్ణారావు, కార్యదర్శి రంగనాథస్వామి, కోశాధికారి రేణుక, ప్రతినిధులు కోట శ్రీనివాస్, పెద్ది సాంబశివుడు, కోట కల్పన, సంధ్య, అన్నపూర్ణ, హైమ, ఇమ్మడి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికల సంరక్షణకు కృషి



నల్లబెల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి కేంద్రాల ద్వారా మహిళల, బాలికల రక్షణకు కృషి చేస్తున్నాయని సఖి సెంటర్ కేస్ వర్కర్ స్వప్న తెలిపారు. మండలంలోని శనిగరం, రాంపూర్ గ్రామాల్లో సఖి సెంటర్ సేవలు, రక్షణ చట్టాలపై మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడారు. సఖి కేంద్రాల ద్వారా బాధిత మహిళలకు పోలీస్, న్యాయ, వైద్య సాయాలతోపాటు ఉచితంగా వసతి లభిస్తుందని చెప్పారు. సఖి కేంద్రం 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, బాలికలు డయల్ 100, 181 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేసి రక్షణ పొందాలని సూచించారు. అనంతరం సఖి కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమెన్ హబ్ జెండర్ స్పెషలిస్ట్ హర్షిత, సీసీ పద్మ, వీఓఏలు ఉమ, పద్మలీల, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన మిట్టగడపుల నర్సయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి వెంకట్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్ 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. తొలుత నర్సయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మేడి వెంకటేశ్వర్లు, నాయకులు ఉప్పరి వీరస్వామి, తాళ్ల సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడి మృతి

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు చిలుక యాకూబ్ (70) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. యాకూబ్ అంత్యక్రియల కోసం మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ మంగళవారం రూ.5 వేల సాయం అందజేశారు. స్థానిక సోషల్ సర్వీస్ టీమ్ సభ్యుడు, టీచర్ కర్ణకంటి రామ్మూర్తి, ఉద్యమకారులు నాంపెల్లి శ్రీనివాస్, మేకల కుమారస్వామి, గ్రామ పెద్దలు ముల్క సత్యనారాయణ, యాదగిరి కుమారస్వామి, కత్తి వెంకటేశ్వర్లు, ఇనుముల ప్రభాకర్ తదితరులు నివాళులర్పించారు.

కూలుతున్న డివైడర్లు

- నాణ్యతాలోపమంటూ పలువురి ఆరోపణ
- కరువైన అధికారుల పర్యవేక్షణ
- ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్ వ్యవహారం



నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో మూడు నెలలకే కూలిపోతున్న డివైడర్లు

పరకాల : పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న డివైడర్లు నాణ్యతా లోపంతో మూడు నెలలకే కూలిపోతున్నాయి. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నిర్మిస్తుండడం, అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో డివైడర్ల నిర్మాణ పనులు పూర్తికాకముందే కూలిపోతున్నట్లు స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. బస్టాండ్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు మూడేళ్ల క్రితం డివైడర్ల నిర్మాణ పనులు పూర్తికాగా బస్టాండ్ నుంచి వెల్లంపల్లి రోడ్డు, ఆర్టీసీ డిపో వరకు జరగాలిసిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి పనులు ప్రారంభింపజేశారు. కానీ సదరు కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. చిన్న వాహనం తగిలినా డివైడర్లు కుప్పకూలి పోతున్నాయని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు ప్రేక్షక పాత్ర పోశిస్తున్నారని పట్టణవాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి



నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా డివైడర్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి. అధికారులు పర్యవేక్షించి నాణ్యతా ప్రమాణాలతో కూడిన నిర్మాణం జరిగేలా కృషి చేయాలి.

-బెజ్జంకి పూర్ణాచారి, 9వ వార్డు మాజీ కౌన్సిలర్

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కమలాపూర్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం, రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంపై హుజూరాబాద్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బస్టాండ్ కూడలి వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఏఎంసీ డైరెక్టర్లు భిక్షపతి, కృష్ణ, లింగయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, శరత్, రోహిత్, తేజ, నవీన్, ఆసీఫ్, సత్యపాల్, కాంగ్రెస్ నాయకులు భిక్షపతి, డాక్టర్ కుమారస్వామి పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఐనవోలు : భారత ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ మండల నాయకులు మంగళవారం కొండపర్తి గ్రామపంచాయతీ ఆవరణలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ప్రణయ్ మాట్లాడుతూ.. కొండపర్తి వయా ముల్కలగూడెం – ఒంటిమామిడిపల్లి 5.7 కిలోమీటర్ల బీటీ రోడ్డు ప్రధానమంత్రి సడక్ యోజన ద్వారా మంజూరైనట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన సందర్భంగా మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో హరితహారం, పల్లె ప్రకృతి వనం, వైకుంఠ ధామాలు నిర్మించినట్లు చెప్పారు. గ్రామాల అభివృద్ధికి బీజేపీ సహకరిస్తుందన్నారు. మండల ప్రధాన కార్యదర్శి రవితేజ, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ కిరణ్, రాజేష్, నాయకులు రవీందర్‌రెడ్డి, విజయ్, రమేశ్, సాంబరాజు పాల్గొన్నారు.

కూరగాయల సాగుకు ప్రభుత్వం రాయితీ

దామెర : కూరగాయల సాగుకోసం వివిధ పథకాల ద్వారా రాయితీలు అందించనున్నట్లు ఉద్యావన శాఖ అధికారి మధులిక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూరగాయల నారును 5 కరాల వరకు100 శాతం సబ్సిడీతో అందించినట్లు పేర్కొన్నారు. బీర, కాకర సాగుచేసే రైతులకు శాశ్వత పందిళ్ల నిర్మాణం కోసం 50 శాతం రాయితీ అర ఎకరం ఒక యూనిట్‌కు గాను 50వేలు చొప్పున రెండున్నర ఎకరాల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కలుపు సమస్యలను అధిగమించేందుకు ఎరువుల యాజమాన్యం తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడికి ఉపయోగపడే మల్చింగ్ కోసం ఎకరాకు 8వేల చొప్పున 5 ఎకరాల వరకు సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. పసుపు సాగుచేసే రైతులను ప్రోత్సహించే విధంగా ఎకరాకు 16వేలు సబ్సిడీ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. బిందు సేద్యం, తుంపర్ల సేద్యం పరికరాలకు సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ పత్రాలతో సంప్రదించాలని ఆమె సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమలాపూర్ : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు గంటల ప్రాతిపదికన ఇంగ్లిష్ సబ్జెక్ట్ బోధించేందుకు ఇంగ్లిష్ పీజీటీ పోస్టు భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత మంగళవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. ఈనెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు కమలాపూర్‌లోని మోడల్ స్కూల్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయని, అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరుకావాలని ఈ సందర్భంగా ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం

- ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్

కమలాపూర్ : మానవ అక్రమ రవాణా నేరమని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం మానవ అక్రమ రవాణా, ఆపరేషన్ ముస్కాన్‌పై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం మానవ అక్రమ రవాణా వేగంగా విస్తరిస్తోందని, స్వార్థం కోసం ఒక మనిషిని ఇంకో మనిషి విక్రయించడం, దోచుకోవడం, జరుగుతోందన్నారు. ఆడ, మగ అనే జెండర్ అసమానతలు ఉండొద్దని, అందరు సమానమేనని అన్నారు. 18 ఏళ్ల లోపు వారిని పనుల్లో నియమించుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ డీఎంసీ కల్యాణి, ప్రిన్సిపాల్ అనిత, ఎస్సై సుధాకర్, స్థానిక ఎస్సై మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- డీపీఓ లక్ష్మీరమాకాంత్



మురికి కాల్వ శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

ధర్మసాగర్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్ సూచించారు. మండలంలోని జానకిపురం గ్రామంలో ఆయన మంగళవారం ఇంటింటికి తిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత నిర్మించుకోవాలని కోరారు. ప్లాస్టిక్ డ్రమ్ములు, కుండీలను పరిశీలించి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని స్థానికులకు సూచించారు. అలాగే రోడ్లపై నీటి నిల్వ ప్రదేశాలను, మురికి కాల్వలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్‌కుమార్, ఎంపీఓ అఫ్జల్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- వైద్యులు కిషన్, తయార్‌మసూద్



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

దామెర : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రెడ్‌క్రాస్ వైద్యులు డాక్టర్ కిషన్, తయార్‌మసూద్ సూచించారు. మండలంలోని ల్యాదెళ్లలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 52మందికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వ్యాధులను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి నెలా వైద్యపరీక్షలు చేసుకోవాలని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ సిబ్బంది శివకుమార్, గంగాధర్, సతీష్, శ్రీకాంత్, నర్సింహచారి, వర్షిత్, సుమంత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో జెండా ఎగురవేయాలి



మాట్లాడుతున్న రామ్‌గోపాల్‌రెడ్డి

ఎల్కతుర్తి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొమటిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఓ పంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన మండలస్థాయి సన్నాహక సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు. గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు బోర్లు వేసినట్లు చెప్పారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లపై ప్రజలు విసిగిపోయి ఉన్నారని, గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జెండా ఎగురవేసేందుకు ప్రతిఒక్కరూ కష్టపడాలని అన్నారు. నాయకులు చిరంజీవి, శ్రీనివాస్, కిష్టయ్య, వెంకటేష్, శంకరయ్యతో పాటు నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవాదుల నీటిని విడుదల చేయాలి

- బీఆర్‌ఎస్ నాయకుల వినతి



చింతగట్టు క్యాంప్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

ఎల్కతుర్తి : ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి మెట్టప్రాంతమైన భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాలకు నార్త్ కెనాల్ కాల్వ ద్వారా సాగునీరు విడుదల చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పలువురు రైతులతో కలసి చింతగట్టు క్యాంప్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సాగుకోసం రైతులు పొలాల్లో నారు పోసుకుని నెలరోజులు గడుస్తున్నా దేవాదుల నీరు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వ్యవసాయ బావుల్లో సాగుకు సరిపడా నీటి లభ్యత లేకపోవడంతో నారు ముదిరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి దేవాదుల నీటిని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలకు నార్త్ కెనాల్ కాల్వ ద్వారా విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో రెండు మండలాల రైతులతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఉన్నతాధికారులు సైతం స్పందించాలని కోరారు. ఆయన వెంట పలువురు రైతులు ఉన్నారు.


సంక్షిప్తంగా

వాటర్ ఫిల్టర్ బహూకరణ



శాయంపేట : మండల కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థినుల సౌకర్యార్థం మండల కేంద్రానికి చెందిన బాసాని శంకరయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు వినయభూషణ్, శైలేష్ కుమార్ రూ.25వేల విలువచేసే వాటర్ ఫిల్టర్ బహూకరించారు. ఈ మేరకు మంగళవారం శంకరయ్య సోదరుడు బాసాని సుబ్రహ్మణ్యం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సుష్మకు అందించారు. హాస్టల్ బాలికలకు శుద్ధిచేసిన తాగునీరు అందించాలని ఉద్దేశ్యంతో వాటర్ ఫిల్టర్ అందించినట్లు చెప్పారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన బొమ్మకంటి నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బొమ్మకంటి వారియర్స్ సభ్యులు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ. 8,400 ఆర్థికసాయం అందించారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

మండల కేంద్రానికి చెందిన నాలికె నర్సయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నర్సయ్య కుమారుడు నాలికె భిక్షపతితో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న చిన్ననాటి స్నేహితులు మంగళవారం భిక్షపతిని పరామర్శించారు. రూ.11,000 ఆర్థికసాయం అందించారు. కందగట్ల సంతోశ్, మార్త సుమన్, బాసవి రవి, రాజేందర్, సూర్యప్రకాశ్, అంకూషావళీ, భాస్కర్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తీగ తగిలి దుక్కిటెద్దు మృతి



ఎల్కతుర్తి : ట్రాన్స్‌ఫార్మర్ తీగ తగిలి దుక్కిటెద్దు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామంలోని బొజ్జ రవి అనే రైతుకు చెందిన ఎద్దు పచ్చిక మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన తీగ తగలడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలిందని బాధిత రైతు కన్నీరు పెట్టాడు. ఎద్దు విలువ సుమారు రూ. 60 వేలు ఉటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఏడాది క్రితం ట్రాన్స్‌ఫార్మర్ గద్దె నిర్మాణం పూర్తైనా అమర్చకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు బాధిత రైతు తెలిపాడు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో నిర్వహించతలపెట్టిన బీసీ మహా ధర్నాకు మంగళవారం మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీ బీసీ నాయకులు తరలివెళ్లారు. ఆ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుర్రం రవీందర్ మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తరలివెళ్లిన వారిలో నాయకులు గణేశ్, సారయ్య, రమేశ్, మహేందర్, సాయికృష్ణ, తరుణ్‌గోపి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్య తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కమలాపూర్ : ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్‌ఏ) జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మండల పరిధిలో ఉన్న పలు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బుక్స్, యూనిఫాం, స్టేషనరీ వస్తువులు అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పలు ప్రైవేట్ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని, ఆయా పాఠశాలలపై తక్షణమే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్‌ఏ జిల్లా నాయకులు సంజయ్, కరణ్యకుమార్ పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

పరకాల : డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ డిమాండ్ చేశారు. మంగళవారం డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనుల వద్ద కార్యకర్తలతో నిరసన తెలిపారు. సొంత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా కళాశాల భవన నిర్మాణంపై పాలకులు నిర్లక్ష్యం తగదన్నారు. వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు ఈశ్వర్, నాయకులు అరవింద్, మహేశ్, విజయ్, అరుణ, సాయి, కృష్ణ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో నైపుణ్య దినోత్సవం



ముల్కనూరు ఆదర్శ పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని మోడల్ స్కూల్‌లో ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవం మంగళవారం ఉత్సాహంగా జరిగింది. డ్రాయింగ్ పోటీలు, రాంప్‌వాక్, తదితర కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పాఠశాల, ప్రిన్సిపాల్ రహమాన్ పాషా, ఉధ్యాయులు సందీప్, సంధ్య పాల్గొన్నారు.

ఎల్కతుర్తి మోడల్ స్కూల్లో

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో వరల్డ్ యూత్ స్కిల్ డే సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఒకేషనల్ టీచర్లు శివకుమార్, కృష్ణవేణి పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బ్యూటీషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంప్యూటర్స్‌లో స్కిల్స్ పెంపొందించేందుకు పాఠ్యపుస్తకాలు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి

- డాక్టర్ ప్రహసిత్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రహసిత్

దామెర : విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దని మానసిక వైద్య నిపుణుడు ప్రహసిత్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఒగ్లాపూర్ సమీపంలో గల ఎంజేపీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి ఆహారం తీసుకోవడంతో పాటు సరిపడా నిద్రిస్తే ఒత్తిడి జయించవచ్చన్నారు. చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొని మానసిక ఉల్లాసాన్ని పొందాలన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికబద్ధంగా చదువుకోవాలని స్పష్టం చేశారు. చిన్న విషయాలకే విపరీతంగా ఆలోచించి, ఆవేశంలో నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. ఎంఈఓ రాజేష్‌కుమార్ ఉన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్ ధర్మారంలో గోదాసి చిన్న మిత్ర మండలి ఆధ్వర్యంలో హనుమకొండకు చెందిన గణేశ ఐ కేర్ ఆస్పత్రి, ఎన్‌ఆర్‌ఐ ఇండో అమెరికన్ సంస్థ సహకారంతో మంగళవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా 35 మందికి శస్త్రచికిత్స అవసరమని నిర్ధారించారు. హైదరాబాద్‌లోని ఎన్‌ఆర్‌ఐ ఇండో అమెరికన్ సంస్థ ద్వారా ఉచితంగా శస్త్రచికిత్స చేయించడంతోపాటు మందులు ఇప్పిస్తామని డాక్టర్ గుండేటి గణేశ్ తెలిపారు. డాక్టర్ భారతి మాట్లాడుతూ ఆస్పత్రి ఆధ్వర్యంలో రూ.40 వేల విలువైన కంటి శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తామన్నారు. పేదలకు ఉచిత సేవలు నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సహాయక సిబ్బంది పూజ, స్వప్న, చిన్న మిత్రమండలి సభ్యులు గోదాసి వీరేశం, బైకని శివ పవన్, పోలెబోయిన భరత్, శ్రీధర్ యాదవ్, పర్ష మోహన్, సునీల్, రాజ్‌కుమార్, అనిల్ యాదవ్, నాగరాజు, లింగమూర్తి, రామ్మూర్తి, రవి, క్రాంతి, రాజు పాల్గొన్నారు.